



రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న కలెక్టర్ కుమార్ దీపక్

జిల్లాకు జాతీయ స్థాయి పురస్కారం

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జలశక్తి మంత్రిత్వ శాఖకు చెందిన జల వనరులు, నదుల వికాసం, గంగ సంరక్షణ విభాగంలో జాతీయ స్థాయి పురస్కారాన్ని కలెక్టర్ కమార్‌దీపక్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా మంగళవారం ఢిల్లీలో అందుకున్నారు. 2024వ సంవత్సరానికి గాను జాతీయ స్థాయి ఆరో జల పురస్కారాల్లో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా కలెక్టర్ కుమార్ దీపక్ పురస్కారాన్ని అందుకున్నారు. జల సంచాయ్ జన్ భాగిదారి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలో 5,20,362 పనులను పూర్తి చేసి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకును సాధించింది. మొదటి కేటగిరిలో మంచిర్యాల జిల్లాకు అవార్డుతో పాటు రెండు కోట్ల నగదు పురస్కారం వచ్చింది. కార్యక్రమంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి పాటిల్, సహాయ మంత్రి రాజ్ భూషణ్‌చౌదరి, నదుల వికాసం కార్యదర్శి కాంతారావు, అశోక్ పాల్గొన్నారు.

రణభేరి సభ పోస్టర్లు విడుదల

లక్షెట్టిపేట, నవంబరు, 18 (ఆంధ్రజ్యోతి): మాలల రణభేరి సభ పోస్టర్లను మాల మహానాడు సంఘం నాయకులు లక్షెట్టిపేట పట్టణంలోని ఐబీ ఆవరణలో మంగళవారం విడుదల చేశారు. ఈసందర్భంగా మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దమ్మ నారాయణ మాట్లాడుతూ ఎస్సీలకు 24శాతం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న హైదరాబాద్‌లో నిర్వహించే రణభేరి సభకు మాలలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాలెం చిన్నయ్య, బూపెల్లి మల్లేష్, దొంత నర్సయ్య, బైరం లింగన్న, తోగరు రాజు, మినుముల శాంతి కుమార్, దొండ ప్రభాకర్, గరిస రవీందర్, కోడి మల్లేష్, విజయ్, జనార్ధన్, సత్తయ్య, ప్రేంసాగర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత

తాండూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత అని ఎస్ఐ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. తాండూర్‌లోని సుభద్ర కాలనీ, అంగడి బజార్ ఏరియాల్లో కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాంను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోదాలు చేసి సరైనపత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఏమైనా సమస్యలున్నా, ఆపద వచ్చినా డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన దారులు అన్ని ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

సహకార సంఘాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

భీమారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. అఖిల భారత సహకార సంఘం వారోత్సవాలను మండలంలోని ఖాజీపల్లి గ్రామంలో శ్రీకృష్ణ యాదవ సొసైటీ, తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీవో సత్యనారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు, ఏసీపీ వెంకటేశ్వర్లు, పశువైద్యుడు రాకేష్ హాజరై మాట్లాడారు. సహకార సంఘాలకు రుణాలు ఇచ్చి సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సహకార సంఘాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అశోక్ యాదవ్ మాట్లడుతూ సహకార సంఘాలు ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తాయన్నారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాజన్న యాదవ్, గురువయ్య, రాజేష్, కొమురన్న, సమ్మన్న, శ్రీనివాస్ యాదవ్, మల్లేష్ యాదవ్, పర్వతాలు యాదవ్, దుశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను కాల్చవద్దు: ఏడీఏ

హాజీపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా గుడిపేట రైతువేదిక వద్ద మంగళవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంచిర్యాల డివిజన్ ఏడీఏ మామిడి కృష్ణ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించి, వచ్చిన ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలని సూచించారు. వరి కొయ్యలను కాల్చకుండా వాటిని కలియదున్నితే రైతులకు ఎక్కువ లాభం ఉంటుందని వివరించారు. మొక్కజొన్న, పప్పుదినుసులు, కూరగాయల పంటలను విస్తృతంగా సాగు చేయాలని రైతులకు సూచించారు. అనంతరం భూసార పరీక్ష ఫలితాల కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో కృష్ణ, ఏఈవో ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నెన్నెలలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గడ్డం వినోద్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, మహిళలు

నెన్నెల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలుంటే పోటీకి అనర్హులనే నిబంధన ఎత్తివేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళలు నెన్నెలలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎందరో ప్రజ సేవ చేసే నాయకులు ఈ నిబంధన వల్లా పదవులు పొందలేక పోయారని నాయకులు అన్నారు. రానున్న పంచాయతీ మండల పరిషత్ ఎన్నికల్లో మహిళల ప్రాతినిధ్యం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. 30 ఏళ్లుగా అమలులో ఉన్న ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేసేందుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, క్యాబినెట్ మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, మాజీ ఎంపీపీ బొమ్మెన శ్రీమతి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కంపెల రాజశేఖర్, నాయకులు సాంబమూర్తిగౌడ్, పుప్పాల అంజన్న పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి


కాసిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులందరు కపాస్ కిసాన్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ సూచించారు. ముత్యంపల్లి రైతు వేదికలో రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పత్తి రైతులందరు మద్దతు ధర పొందాలంటే తేమ 8 నుంచి 12 శాతం ఉండాలన్నారు. ఈ సీజన్‌లో పత్తి కొనుగోలు సీసీఐ కేవలం కపాస్ కిసాన్ యాప్ ద్వారా మాత్రమే చేపట్టనుందని తెలిపారు. రైతులు యాప్‌లో స్లాట్ బుక్‌చేసుకుని పత్తిని విక్రయించేందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

సర్వే ప్రకారం కరకట్టల నిర్మాణం

జరిగేనా..?



కరకట్టలో తొలగించాల్సిన ఓ కాంపౌండ్ (దాన్ని తప్పించినట్లు ప్రచారం జరుగుతోంది)



రాళ్లవాగులో కరకట్ట నిర్మించాల్సిన ప్రదేశం

- మార్కింగ్‌ను వదిలి వాగులోకి వెళ్లేలా ప్లాన్
- తమ భూములను కాపాడేందుకు పలువురి స్కెచ్
- ప్లాన్ మార్చేలా అధికారులపై తీవ్ర ఒత్తిడి
- కొందరికి మేలు చేకూర్చేందుకు రంగం సిద్ధం..!

మంచిర్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నగరాన్ని వరద ముంపు నుంచి కాపాడేందుకు రాళ్లవాగులో చేపట్టిన 'కరకట్టల' నిర్మాణంలో నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడుతున్నట్లు తెలుస్తోంది. వర్షాకాలంలో రాళ్లవాగు నీరు నివాస గృహాల్లోకి ప్రవేశించకుండా ఉండేందుకు కరకట్టల నిర్మాణం అనివార్యం అయింది. నగరంలోని కార్మెల్ స్కూల్ సమీపంలోగల వంతెన నుంచి మొదలుకొని గోదావరి నది వరకు కరకట్ట నిర్మించాలని ప్రతిపాదించారు. గత ఏడాది డిసెంబరులో కరకట్ట నిర్మాణం కోసం ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా రాళ్లవాగు వెంట సర్వే నిర్వహించి ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేశారు. నిర్మాణ పనులను హైద్రాబాద్‌లోని ఎస్ఎల్ఆర్ కంపెనీ దక్కించుకోగా, రూ. 255 కోట్ల అంచనా వ్యయంతో వారం రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయి.

7.3 కిలో మీటర్ల మేర నిర్మాణం..

ప్రస్తుతానికి రాళ్ల వాగుకు ఎడమ వైపున 7.3 కిలో మీటర్ల మేర కరకట్ట నిర్మాణం చేపడుతున్నారు. వానాకాలంలో రాళ్లవాగు నుంచి సుమారు 60వేల క్యూసెక్కుల వరద గోదావరిలో కలుస్తున్నట్లు అంచనా. ఈ వరదకు తోడు గోదావరి బ్యాక్ వాటర్ కలిసి పట్టణంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. కరకట్టను వాగు ఎడమ (రాళ్లపేట) వైపు ఒడ్డు వెంట ఎత్తు, పల్లాల ప్రకారం కనీసం ఐదు నుంచి గరిష్టంగా 14 మీటర్ల ఎత్తుతో నిర్మించనున్నారు. మరోవైపు వాగు లోకి వర్షపునీరు ప్రవహించేలా మూడు చోట్ల ఖాళీగా వదిలివేయనున్నారు. కాగా కరకట్ట నిర్మాణ పనులను రెండేళ్ల కాల పరిమితితో పూర్తి చేయాల్సి ఉంది. కరకట్ట నిర్మాణం పూర్తయితే మంచిర్యాల నగరంలోని రాళ్లపేట, రెడ్డికాలనీ, ఆదిత్య ఎన్‌క్లేవ్, ఎల్ఐసీ కాలనీ, రాంనగర్, ఎన్టీఆర్ నగర్, తదితర ప్రాంతాలకు ముంపు బాధలు తప్పనున్నాయి.

'ప్లాన్'కు విరుద్ధంగా పనులు.?

కరకట్ట నిర్మాణంలో సర్వే ఆధారంగా రూపొందించిన 'ప్లాన్'కు విరుద్ధంగా పనులు చేపట్టేందుకు రంగం సిద్ధమైనట్లు పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. కరకట్ట నిర్మాణంలో భాగంగా అధికారులు 'మార్కింగ్' చేసిన ప్రకారం పెద్ద మొత్తంలో భూములు రాళ్లవాగులో కలుస్తున్నాయి. వాస్తవంగా ఆ భూములన్నీ రాళ్లవాగుకు చెందినవే కాగా కాలక్రమేణ ఆక్రమణలకు గురయ్యాయి. కరకట్ట నిర్మాణం కోసం అధికారులు సర్వే జరిపినపుడు వర్షాకాలంలో వాగు ప్రవాహం, వరద ఉధృతిని పరిగణలోకి తీసుకున్నారు. వరద ప్రవాహం మేరకు..

మిగతా 7లో..

బంగారు పంట

దండేపల్లి మండలం గూడెం సమీపంలోని గోదావరి వద్ద వంతెనకు ఇరువైపులా నదీ తీరంలో సాగవుతున్న వరి పంట బంగారు వర్ణంలో మెరిసిపోతూ చూపరులను ఆకట్టుకుంటోంది. రైతులు నదికి ఇరువైపులా వానా కాలంలో వరి సాగు చేపట్టారు. ప్రస్తుతం పంట కోతకు రావడంతో బంగారు వర్ణంలోకి మారింది. వంతెన పైనుంచి చూస్తే గలగల పారే గోదావరి.. ఆ పక్కనే ఉన్న పొలాలు.. మధ్యమధ్యలో ఆకుపచ్చ రంగులో ఉన్న ఒడ్లు.. అక్కడక్కడా ఉన్న పచ్చని చెట్లు చూపరులను మైమరిపిస్తున్నాయి. - దండేపల్లి, ఆంధ్రజ్యోతి



ఉపాధిహామీ పనులు కల్పించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

లక్షెట్టిపేట, నవంబరు, 18 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీలో కూలీలకు ఉపాధిహామీ పనులు కల్పించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు మున్సిపల్ కమిషనర్ విజయ్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. లక్షెట్టిపేట మున్సిపాలిటీగా ఏర్పాటు కాకముందు ఇక్కడ కూలీలకు ఉపాధిహామీ పనులు ఉండేవన్నారు. మున్సిపాలిటీగా ప్రతిపాదించిన తర్వాత పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కనిగారపు అశోక్, దుంపల రంజిత్, శోభ, మల్లేష్, కార్మిక సంఘం నాయకుడు రాజలింగు ఉన్నారు.

నషాముక్త్ భారత్ నిర్మాణానికి సహకరించాలి

రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా





అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా, కోటపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మంచిర్యాల క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నషాముక్త్ భారత్ నిర్మాణానికి ప్రజల సహకారం అవసరమని, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బంది, సీపీవో సిబ్బందితో కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని, సామాజిక సమస్యలు పెరుగు తున్నాయన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఇతరు లను దూరంగా ఉండేలా చైతన్యం కల్పించాలని సూచించారు. మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. యువతలో అవగాహన పెంచేందుకు గాను పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరాపై ప్రత్యేక నిఘా పెట్టి వారిని పట్టుకోవడం, మత్తుకు బానిసలుగా మారిన వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించడం, రెహబిలిటేషన్ సెంటర్లకు పంపించడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. నషాముక్త్ భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే ప్రజలు, యువత సహకారం కీలకమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ అడ్మిన్ డీసీపీ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచి ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏవో శ్రీనివాస్, సీఐ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మంచిర్యాల క్రైం: విద్యార్థులు గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉన్నప్పుడే ఉన్నత లక్ష్యా లను సాధిస్తారని ఎక్సైజ్ సీఐ గురువయ్య అన్నారు. నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల పట్టణం ప్రభుత్వ మెడికల్ కళాశాల, అల్ఫోర్స్, ఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాల, వేంపల్లి ఎస్ఆర్ఆర్ కళాశాలలో విద్యారులకు మత్తు పదార్థాల నిర్మూళనపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రసాద్, సౌజన్య, రౌఫ్‌ఖాన్

చెన్నూరు (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజంలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, పట్టణ ఎస్ఐ సుబ్బారావులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని చిన్నముస్ని పాఠశాలలో డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిట రీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కిరణ్, స్కూల్ హెచ్ఎం తిష్య, వైస్ ప్రిన్సిపాల్ నూరుద్దీన్, పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ వల్ల ఆరోగ్యంపై చూపే ప్రభావం గురించి శ్రీరాంపూర్ ఐటీఐ విద్యార్థులకు ఎస్ఐ మేకల సంతోష్ అవగాహన కల్పించారు. విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

కోటపల్లి (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని ఇందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిత అన్నారు. మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో అనిత, జిల్లా సంక్షేమ అషధికారి రౌఫ్‌ఖాన్, ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసాద్ మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. డాక్టర్ జగతి, శ్రీకాంత్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

జన్నారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థిలో సృజనాత్మకతను వెలికితీయాలని మండల విద్యాధికారి విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కలమడుగు ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రత్యేక మోటివేషన్ కార్యక్రమాలను సత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ ఆర్గనైజర్ రమేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజమౌళి, సత్యనారాయణ, బాబురావు పాల్గొన్నారు.

పనులకు భూమి పూజ

కన్నెపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో కాంపౌండ్‌వాల్‌కు, జన్కాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో వంటగది నిర్మాణానికి బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవ రఘు నర్సింగరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామాంజనేయ, నర్సింగరావులు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రహారీ నిర్మాణానికి రూ. 9.89 లక్షలు, వంటగదికి రూ. 2.50 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో శ్రీనివాస్, కేజీబీవీ ఎస్‌వో, కాంగ్రెస్ నాయకులు రోహిత్, సుధీర్‌గౌడ్, వెంకటేష్, శ్రీనివాస్, సతీష్, బాపు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ విఫల నాయకుడు

- ఆయన నాయకత్వంలో అన్నీ ఓటములే
- స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీదే విజయం
- మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి

మందమర్రిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓ విఫల నాయకుడని, ఆయన నాయకత్వం వహించిన ఎన్నికలన్నీ ఓటమి చవిచూశాయని ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తమ పార్టీ విజయమే మరో నిదర్శనమని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆయన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం అయిన నాటి నుంచి పార్టీ పతనపు అంచుల్లోకి చేరుకుందని పార్టీ కోలుకునే స్థాయిలో లేదన్నారు. మంగళవారం బొక్కలగుట్ట వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 2023 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ప్రజాప్రభుత్వం ఏర్పడడం తట్టుకోలేక మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమయ్యాడని పేర్కొన్నారు. రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి కేటీఆర్ కుటుంబం కోట్లు గడిచిందని తెలిపారు. లెక్కలేని కుంభకోణాలు చేసి రాష్ట్రాన్ని దివాలా తీసేలా చేశారని విమర్శించారు. వీరి అవినీతి భాగోతం గురించి కేటీఆర్ చెల్లెలు కవిత పదేపదే ఆరోపిస్తున్నా జవాబు చెప్పడం లేదని వారు తప్పించుకు తిరుగుతు న్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ సంక్షేమ రంగాన్ని పరుగులు పెట్టిస్తూ పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లోని ఆరు గ్యారంటీలను అమలు చేయడంతో సన్నబియ్యం పథకాన్ని దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. రానున్నరోజుల్లో బీఆర్ఎస్ కనుమరుగవడం ఖాయమని పేర్కొన్నారు.

సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లె రాజు, పి రఘునాథ్‌రెడ్డి, ఎండీ అజీజ్, గాండ్ల సమ్మయ్య, వొడ్నాల శ్రీనివాస్, మహంకాళి శ్రీనివాస్, బొలిశెట్టి కనకయ్య, ఎండీ ఇసాక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జి వివేక్ వెంకటస్వామి

పేదింటి ఆడబిడ్డల రుణం తీర్చుకుంటాం

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడపడుచు రుణం తీర్చుకుంటామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలానికి చెందిన సుమారు 200 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ప్రతీ ఇంటికి 200 యూనిట్ల విద్యుత్‌ను అందజేస్తున్నామని తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తి స్థాయిలో పైచేయి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

- చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం...

రైతు పండించిన వరి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని రేండ్లగూడ, మొర్రిగూడ గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో డీసీఎంఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఫసియుల్లా, మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ, నాయకులు ఇసాక్, మాణిక్యం, అల్లం రవి, దుమ్మల రమేశ్, కరుణాకర్, అజారోద్దీన్ పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి

కౌటాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని డీఎంహెచ్‌వో సీతారాం అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పిల్లలకు కరీంనగర్ శ్రీ హైందవ సేవా సంస్థ డాక్టర్ జగన్మోహన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో సీతారాం మాట్లాడుతూ బడీడు పిల్లలు శుభ్రత కలిగిన మంచి ఆహారపు అలవాట్లను కలిగి ఉండాలని చెప్పారు. తద్వారా వారి ఆరోగ్యం పటిష్టంగా ఉండి వారి లక్ష్యాలను చేరుకోవడానికి అనుకూలంగా ఉంటుందని అన్నారు. కళ్లను సంరక్షించుకోవడంలో విద్యార్థులు జాగ్రత్తలు వహించాలని సూచించారు. కంటి పరీక్షల అనంతరం ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నారాయణసింగ్, ఉపాధ్యాయులు రమేష్, నరసింహాచారి, ఏసుమణి, సంధ్యారాణి, సింధు, రైసమ్మద్, మెడికల్ ఆఫీసర్ నవత, డాక్టర పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.


కాగజ్‌నగర్‌లో పగుళ్లు తేలిన సర్‌సిల్క్–కోసిని రోడ్డు

మున్సిపాలిటీకి నిధులు మంజూరు..

● రూ.18.70 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం ● సీసీ రోడ్ల నిర్మాణానికి అధికారుల చర్యలు

కాగజ్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు ఆటంకాలు తొలగిపోనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అన్ని మున్సిపాల్టీలకు నిధులను విడుదల చేసింది. ఇందులో భాగంగా కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి రూ.18.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పట్టణంలో అత్యవసరంగా ఉన్న రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. దీని కోసం ఇటీవల అధికారులు శిథిలావస్థకు చేరిన రోడ్లపై సర్వేలు నిర్వహించారు. నిధులు రానుండడంతో అధికారులు డిటైల్ ప్రాజక్టు రిపోర్టు(డీపీఆర్) సిద్ధం చేస్తున్నారు. టెక్నికల్ అనుమతి పొందగానే టెండర్ పనులు ప్రారంభించనున్నారు. కాగజ్‌నగర్ మెయిన్ మార్కెట్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు రోడ్డు అధ్వానంగా మారింది. ఆ రోడ్డు పై పలు చోట్ల గుంతలపడడంతో నిత్యం వాహన దారులు రాకపోకలకు ఇబ్బందులుపడుతున్నారు. సర్‌సిల్క్ రాంమందిర్ నుంచి కోసిని డాడానగర్ చౌరస్తా వరకు రహదారిపై పగుళ్లు తేలాయి.

పగుళ్లు తేలిన ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే ఆటోలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వీటితో పాటు డంపింగ్ యార్డు వద్ద సీసీ రోడ్డు లేదు. ఈ సమస్యలపై నెల రోజుల క్రితం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కాగజ్‌నగర్ మున్సిపాల్టీకి వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.18.70 కోట్లు విడుదల అయ్యాయి. నిధులు విడుదల కావడంతో రోడ్ల సమస్యలు పరిష్కా రమవుతాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌ను వివరణ కోరగా అభివృద్ధి పనుల కోసం డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

నలుగురికి ఐదేళ్లు జైలు శిక్ష

ఆసిఫాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల పరిధిలో మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించి అత్యాచార యత్నం కేసులో నలుగురు నిందితులకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ. 12వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంపీ రమేష్ మంగళవారం తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. డిసెంబరు 5, 2020న మహిళ, తన మైనర్ బాలిక ఇంట్లో ఉన్న సమయంలో బెజ్జూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన చౌదరి జలపతి, చౌదరి సుధాకర్, లంగారి కృష్ణయ్య, లంగారి అంకయ్యలు ఇంట్లోకి చొరబడి దాడి ప్రయత్నం చేసి అసభ్యంగా ప్రవర్తిస్తూ అత్యాచారం చేసేందుకు యత్నించారని పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు బెజ్జూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి కోర్టులో చార్జీసీటు దాఖలు చేశారని తెలిపారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి నిందితులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 12వేల జరిమానా విధించారు. బాధితురాలికి న్యాయం జరిగేలా కృషి చేసిన పోలీసు అధికారులకు, సిబ్బందిని అభినందించారు.

వరిపంటపై అడవి పందుల దాడి

కాసిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్‌లో చేతికంది వచ్చిన వరి పంటపై అడవి పందులు దాడి చేసి ధ్వంసం చేశాయి. సోమవారం రాత్రి వెంకటాపూర్‌కు చెందిన ఏడవేని నారాయణ వరి పొలంలో అడవి పందులు దాడి చేయడంతో అర ఎకరం పంట పూర్తిగా ధ్వంసమైంది. అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను కాపాడుకున్నప్పటికీ అడవి పందుల దాడిలో నష్టపోయామని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. సంబంధిత అధికారులు స్పందించి నష్టపోయిన పంటకు పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

అట్రాసిటీ కేసుపై ఏసీపీ విచారణ

నెన్నెల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మిరెడ్డిపేటలో ఈ నెల 16న జరిగిన గొడవపై బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. జంగాల్‌పేటకు చెందిన కోట శంకర్, దమ్మిరెడ్డిపేటకు చెందిన మొగిలి ఓదేలు, మొగిలి రాజక్క, కొండ చంద్రయ్య, కొండ రాజక్కలకు ఓ భూమి విషయంలో గొడవ జరిగింది. నలుగురు తనను కులం పేరిట దూషించారని శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. సంఘటన స్థలంలో ఏసీపీ విచారించి, సాక్షుల వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. కేసు పూర్వపరాల గూర్చి గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఏసీపీ వెంట హెచ్‌సీ విజయ్ ఉన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

రామకృష్ణాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని మంగళవారం శాంతినగర్ కాలనీవాసులు ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిజామాబాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ సమీపంలోని రామకృష్ణాపూర్ ఆర్‌కే4 గడ్డ శాంతినగర్ కాలనీ సమీపంలోని ఆర్‌కేఓసీ ఫేజ్ -2 పనుల ప్రారంభం కోసం డిసెంబర్ 3న ప్రజాభిప్రాయ సేకరణ ఉన్నదని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆర్‌కేఓసీ ఫేజ్-1 శాంతినగర్ కాలనీ వాసులు బాంబుల బ్లాస్టింగ్‌లతో ఇళ్ల గోడలు పగిలిపోయానని, రోగాల బారిన పడ్డామని చెప్పారు. ఫేజ్-2తో ఇబ్బంది పడకుండా ఇళ్ల స్థలాలు కేటాయించి, నష్టపరిహారం అందజేస్తే వెళ్లిపోతామని తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలపై రాంగ్‌రూట్లలో గ్యాస్ సిలిండర్లను తీసుకు వెళ్తున్న ఇద్దరి వ్యక్తులపై వేర్వేరుగా కేసులను నమోదు చేసినట్లు సీఐ బాలాజీ వరప్రసాద్ తెలిపారు. ఆసిఫాబాద్ పట్టణంలోని ఫారెస్టు చెక్‌పోస్టు నేషనల్ హైవే సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టణంలోని దశ్నాపూర్‌కు చెందిన వైరగాడే సంజీవ్, మండలంలోని గొల్లగూడకు చెందిన కోట శ్రీకాంత్‌లు రాష్ డ్రైవింగ్ చేస్తూ రాంగ్‌రూట్‌లో గ్యాస్ సిలిండర్లను ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్తూ ఇతర ప్రయాణికులకు ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తించారని చెప్పారు. వీరిని అదుపులోకి తీసుకుని పంచుల సమక్షంలో రెండు మోటార్ సైకిళ్లు, రెండు ఎల్‌పీజీ సిలిండర్లు స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రోడ్డు నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

సైబర్ క్రైం నిందితుడి అరెస్టు


మాట్లాడుతున్న సీఐ సురేష్‌కుమార్

సిర్పూర్(టి), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నిందితుడిని అరెస్టు చేసినట్లు కౌటాల సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు సిర్పూర్(టి) పోలీసు స్టేషన్ పరిధిలో జూన్ 2025లో సైబర్ మోసం కేసు నమోదుపై దర్యాప్తు చేపట్టామన్నారు. వాట్సాప్, టెలిగ్రాం ద్వారా వర్క్ ఫ్రం హోం అని, గూగుల్ రివ్యూస్ ఇస్తే డబ్బులు పే చేస్తామని తక్కువ మొత్తంలో మొదట పే చేసి నమ్మిస్తారని అన్నారు. తరువాత క్రిప్టో కర్సెనీ అండ్ వీక్స్ కైయిన్‌లలో పెట్టుబడులు పెడితే అధిక మొత్తంలో డబ్బులు వస్తాయని నమ్మించి మోసం చేస్తున్న సైబర్ క్రైం నిందితుడు అయిన ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అభిషేక్‌కు మార్, రాజు అత్రిలతో పాటు మరికొంత మందిని గుర్తించామని చెప్పారు. ఈ మేరకు సిర్పూర్ (టి) ఏఎస్సై చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు హనుమంతు, వినోద్ నోయిడాకు వెళ్లి నాలుగు రోజుల శ్రమించి ఈ నెల 15న నిందితుడు అభిషేక్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. అనంతరం అక్కడి కోర్టులో హాజరు పరిచి ట్రాన్సిట్ వారెంట్ కరెంట్‌పై సిర్పూర్(టి)కి తీసుకు వచ్చినట్లు తెలిపారు. అతడిని విచారించి వివరాలు సేకరించి సైబర్ క్రైం చేయడంలో నిందితుడు ఉపయోగించిన సెల్‌ఫోన్ స్వాధీన పర్చుకున్నామని చెప్పారు. నిందితుడు తన ఆధార్, పాన్ వివరాలు ఉపయోగించి బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సిస్ బ్యాంకు, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, ఎన్ఎస్‌డీఎల్ పేమెంట్ తదితర బ్యాంకు ఖాతాలను తెరిచి వాటిని మోసపూరిత డబ్బు లావాదేవీలను వినియోగించినట్లు అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచామని చెప్పారు. బాధితుల నుంచి రూ.5 లక్షల వరకు మోసం చేసి రూ.10 వేలు మాత్రమే తిరిగి ఇచ్చినట్లు దర్యాప్తు లో తేలిందన్నారు. నిందితుడు అభిషేక్‌కుమార్‌తో తనకు అందిన డబ్బులను వెంటనే తన బావ రాజు అత్రికి పంపించేవాడని చెప్పారు. ఇద్దరు జల్సాలకు ఖర్చు చేసేవారని తెలిపారు. కేసులో మిగితా నిందితులను కూడా పట్టుకుంటామని సీఐ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్సై సురేష్, ఏఎస్సై చంద్రశేఖర్, కానిస్టేబుల్ హనుమంతు, వినోద్‌లను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్లను వేగంగా పూర్తి చేయాలి


ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న డీపీవో భిక్షపతిగౌడ్

లింగాపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. లింగాపూర్ మండలంలోని చిన్నదంపూర్, జాముల్‌ధరా గ్రామపంచాయతీల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను మంగళవారం డీపీవో ఎండీడీవో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ పనులను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో చెత్తాచెదారం ఎప్పటి కప్పుడు తొలగించాలని సూచించారు. కార్యదర్శులు రోజు వారీ నివేదికలు అందజేయాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రామచందర్, రజనికాంత్, కార్యదర్శులు భీంరావు, పాపయ్య, సాగర్, జగదిస్, శ్రీనివాస్ బారిక్‌రావు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కాగజ్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈసుగాం విలేజీ నంబరు 7కు చెందిన శ్యాంకుమార్ మండల్ బషీరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మంగళవారం ఎమ్మెల్యే హరీష్‌బాబు బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని అప్పగించాలని అధికారులకు సూచించారు.

తల్లిదండ్రుల పోషణ బాధ్యతగా భావించాలి

ఆసిఫాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వయో వృద్ధులు, తల్లిదండ్రుల పోషణ, సంక్షేమం పిల్లల బాధ్యతగా భావించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంపీ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా మహిళా శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వయోవృద్ధులు, తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం-2007పై ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన, అవగాహన సదస్సులో మాట్లాడారు. వయోవృద్ధులు, తల్లిదండ్రుల పోషణ, సక్షేమం ప్రతి ఒక్కరీ బాధ్యత అన్నారు. మొదటగా మనలో మార్పు వస్తే ఇతరులలో మార్పు తీసుకు రావచ్చని చెప్పారు. తల్లిదండ్రులు, పెద్దలపై గౌరవభావం కలిగి ఉండాలని సూచించారు. యువత ప్రస్తుతం మత్తు పదార్థాలకు బానిసలై క్షణికావేశంలో నేరాలు చేస్తున్నారని అన్నారు. ఆస్తుల కోసం కన్న వారిని, తోడబుట్టిన వారిని హాని చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో తల్లిదండ్రులను సరిగ్గా పోషించని కుమారులు, కూతుళ్లపై 28 కేసులు నమోదు చేసి వారికి నోటీసులు జారీ చేశామని అన్నారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించి మార్పునకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆసిఫాబాద్ డివిజన్‌లో ఆర్‌డీవో, కాగజ్‌నగర్ డివిజన్‌లో సబ్‌కలెక్టర్ సాయి వయోవృద్ధుల పోషణ, సంక్షేమం చట్టం ప్రకారం ట్రిబ్యునల్ పని చేస్తున్నాయని తెలిపారు. అనంతరం గోడ ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్ర మంలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి యువరాజ, జూనియర్ జడ్జి అనంతలక్ష్మి, అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా న్యాయమూర్తి, కలెక్టర్, తదితరులు

సింగరేణి సమాచారం

ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలి


పదోన్నతి పత్రాలు అందుకున్న ఉద్యోగులు

మందమర్రిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని, పదోన్నతుల ద్వారా వేతనాల్లో పెరుగుదల ఉంటుందని మందమర్రి జీఎం రాధాకృష్ణ అన్నారు. జీఎం కార్యాలయంలో మంగళవారం కేకే ఓసీపీలో పనిచేస్తున్న నలుగురు బదిలీ వర్కర్లకు జనరల్ అసిస్టెంట్ పదోన్నతి పత్రాలను అందించారు. జీఎం మాట్లాడుతూ ఏ సంస్థలో లేని విధంగా సింగరేణి సంస్థలో మంచి వేతనాలు ఉన్నాయన్నారు. కార్మికులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం లలిత్ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, శాంతిఖని ఏజెంటు ఖాదిర్, సీనియర్‌పర్సనల్ ఆఫీసర్ శంకర్, జీఎం కార్యాలయం సెక్రటరీ దీపిక తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల పత్రాలు అందజేత

కాసిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మందమర్రి డివిజన్ పరిధిలోని కాసిపేట 1, 2 గనుల్లో పనిచేస్తున్న బదిలీ వర్కర్లకు జనరల్ అసిస్టెంట్ పదోన్నతి పత్రాలను మంగళవారం గనుల మేనేజర్‌లు, గుర్తింపు సంఘం నాయకులు అందజేశారు. కాసిపేట 1వ గని మేనేజర్ సతీష్ మాట్లాడుతూ పదోన్నతి పొందిన ఉద్యోగులందరు క్రమ శిక్షణతో పనిచేసి సంస్థ అభివృద్ధికి సహకరించాలన్నారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. కాసిపేట 2వ గనిలో 15 మంది, 1వ గనిలో 14 మంది కార్మికులకు పదోన్నతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ మేనేజర్ రవిశంకర్, వెల్ఫేర్ ఆఫీసర్ భార్గవ్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, గనుల పిట్‌సెక్రటరీలు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

శ్రీరాంపూర్, నవంబరు 18 (నవంబరు): సింగరేణి ఉద్యోగులు పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని శ్రీరాంపూర్ ఓసీపీ ప్రాజెక్ట్ అధికారి సిహెచ్. వెంకటేశ్వర్లు అన్నారు. ఓసీపీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు ఉద్యోగుల ఆరోగ్యంపై దృష్టి సారిస్తోందన్నారు. బీపీ, మధుమేహం వంటి రుగ్మతల నిర్ధారణ కోసం పరీక్షలు చేయించుకొని సమస్య ఉంటే వైద్యం చేయించుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా చేయాలని సూచించారు. జీవనశైలిలో మార్పులు చేసుకొని వ్యాధులు రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఉద్యోగులకు బీపీ, షుగర్, డెంటల్, బీఎంఐ పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ అయిన వారికి కౌన్సెలింగ్ చేసి, తగు సూచనలు ఇచ్చారు. బొగ్గు నాణ్యతా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మేనేజర్ ఐ శ్రీనివాస్, రక్షణాధికారి శ్రీధర్‌రావు, శ్రీరాంపూర్ ఏరియా వైద్యాధికారి మురళీధర్, సంక్షేమాధికారి ఓంకారి బాపు, అధికారులు మధుసూదన్, వెంకటయ్య, ఏఐటీయూసీ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, పిట్ కార్యదర్శి మోతె లచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు పొందిన ఓసీపీ ఉద్యోగులు

హక్కుల కోసం పోరాటం

శ్రీరాంపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హక్కుల కోసం పోరాటం చేస్తామని డిస్మిసల్ ఉద్యోగులు అన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమ పోసర్లను డిస్మిసల్ ఉద్యోగులు మంగళవారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఈ నెల 25న నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని ఉద్యోగాల పునరుద్ధరణ, హక్కుల కోసం పోరాడుదామని తెలిపారు. కార్యక్రమంలో డిస్మిసల్ కార్మికుల సంఘ అధ్యక్షుడు గుంపుల సారయ్య, ప్రధాన కార్యదర్శి శనిగారపు నారాయణ, నాయకులు చంద్రశేఖర్, బండారి రాజేశం, రామగిరి రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

సర్వేను అడ్డుకున్న భూనిర్వాసితులు

జైపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు విస్తరణలో భూములు కోల్పోతున్న రామారావుపేట, ఇందారం గ్రామాలకు చెందిన భూనిర్వాసితులు మంగళవారం సర్వే నిర్వహిస్తున్న సింగరేణి, రెవెన్యూ అధికారులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా భూనిర్వాసితులు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం నోటిఫికేషన్ ఇచ్చి భూములు సేకరించి పలుమార్లు సర్వే నిర్వహిం చి భూములకు ధరలు నిర్ణయించకుండా కాలయాపన చేస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2022 సంవత్సరంలో మోకా సర్వే నిర్వహించి నోటిఫికేషన్ పేపర్ ప్రకటన ద్వారా ప్రకటించి ఇప్పుడు మరోమారు సర్వే నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. ఆగస్టు 18 , 2025న రైతులను ఆర్డీవో కార్యాల యానికి రావాలని నోటిఫికేషన్ ఇచ్చి సింగరేణి అధికారులు కానీ రెవెన్యూ అధికారులు కానీ రైతులతో మాట్లాడలేదని చెప్పారు. ఇప్పటికైనా నిర్వహించే సర్వేను రైతులకు తెలియజేసి నోటిఫికేషన్ ఇచ్చి సర్వే నిర్వహించాలని కోరారు. . సర్వేకు వచ్చిన అధికారుల్లో శ్రీరాంపూర్ సింగరేణి ఎస్టేట్ అధికారి మహేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, తదితరులు ఉన్నారు.

'అభయహస్తం' కోసం దరఖాస్తుల ఆహ్వానం

శీరాంపూర్, నవంబరు 18 (నవంబరు) : సివిల్స్ అభయహస్తం కింద రెండో విడత కోసం సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్. బలరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో గతంలో లక్ష రూపాయల ప్రోత్సాహకాన్ని అందుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోనవసరం లేదని పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన ఇతర అభ్యర్థులు సైతం ఇంటర్వ్యూలకు ఎంపికైతే వారికి కూడా డబ్బులు అందిస్తామన్నారు. తమ దరఖాస్తులను ఈ నెల 21వ తేదీలోపు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో అందజేయాలన్నారు. గతేడాది సివిల్స్ అభయహస్తం పథకం ద్వారా మెయిన్స్‌కు ఎంపికైన 140 మందికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించగా, వారిలో 20 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరికి రెండో విడతగా లక్ష రూపాయల చొప్పున అందించగా, వారిలో ఏడుగురు సివిల్స్ విజేతలుగా నిలిచారని తెలిపారు. ఈ ఏడాది ప్రిలిమ్స్ పాసైన 202 మందికి లక్ష రూపాయల చొప్పున అం దించామని, 43 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని తెలిపారు.

బొగ్గు గని కార్మికులకు గ్రాట్యుటీ సీలింగ్ పెంచాలి

శ్రీరాంపూర్, నవంబరు 18 (నవంబరు): బొగ్గు గని కార్మికులకు గ్రాట్యుటీ సీలింగ్ పెంచాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం జనవరి 2024 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గ్రాట్యుటీ సీలింగ్ రూ.25 లక్షలకు పెంచినట్లుగా ప్రకటించిందని తెలిపారు. భారత ప్రభుత్వం 2010 మే 24 నుంచి గ్రాట్యుటీని రూ. 3.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందని, కానీ 8వ వేజ్‌బోర్డులోని 9.6.0 ఒప్పందం ప్రకారం రూ.10 లక్షల గ్రాట్యుటీని జనవరి 2007 నుంచి అమలు పరిచారన్నారు. దీనివల్ల చాలా మంది ఉద్యోగులు, అధికారులు ప్రయోజనం పొందారన్నారు. బొగ్గు గని కార్మికులకు 2018 మార్చి 29 నుంచి రూ.20లక్షల గ్రాట్యుటీ సీలింగ్, అధికారులకు జనవరి 2017 నుంచి అమలు చేయడం వల్ల రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్థిక నష్టం జరిగిందన్నారు. జాతీయ బొగ్గు వేతన ఒప్పందం 11లోనూ కేంద్ర ప్రభుత్వ గెజిట్ ప్రకారం గ్రాట్యుటీ సీలింగ్ అమలు చేయాలనే నియమం ఉందన్నారు. ఆ ప్రకారం 2025 అక్టోబరు నుంచి అమలు చేసేందుకు స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా యాజ మాన్యం తమ ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. జూలై 2021 నుంచి అమలు పరచాలని బొగ్గు పరిశ్రమలో పనిచేసే ఉద్యోగులు కోరుతున్నారని ఆయన పేర్కొన్నారు. జేబీసీసీఐ సభ్యులు, కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యాలతో చర్చించి ఉద్యోగులకు అన్యాయం జరుగకుండా జూలై 2021 నుంచి రూ.25 లక్షల సర్వీస్ గ్రాట్యుటీ సీలింగ్‌ను పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్వే ప్రకారం 'కరకట్టల' నిర్మాణం జరిగేనా?

(5వ పేజీ తరువాయి..)


సర్వే ప్రకారం తొలగించాల్సిన ఓ భారీ నిర్మాణం

ఎడమ వైపు ఒడ్డు వెంట తొలగించాల్సిన కట్టడాలపై 'మార్కింగ్' చేశారు. ఆ మార్కింగ్ ప్రకారం పెద్ద మొత్తంలో భూములు వాగులోకి వెళ్లనుండగా, భారీ నిర్మాణాలను తొలగించాల్సి వస్తోంది. ప్రస్తుతం కరకట్ట నిర్మాణం ప్రారంభమైనందున భూములు, నిర్మాణాలు కోల్పోకుండా సంబంధీకులు భారీ స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. రాళ్లవాగు ఒడ్డు వెంట పలువురు బడా బాబులకు చెందిన అపార్టుమెంట్లు, భారీ నిర్మాణాలు ఉన్నాయి. సర్వే ప్రకారం మార్కింగ్ ఇచ్చిన విధంగా కరకట్ట నిర్మాణం జరిగితే అవన్నీ తొలగించాల్సి వస్తుంది. కరకట్ట నిర్మాణంతో తమ కట్టడాలకు ముప్పు తప్పేలా ఉండేందుకు బడా బాబులు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా సంబంధిత అధికారులపై ఒత్తిడి తేవడం ద్వారా ప్లాన్ మార్చేం దుకు స్కెచ్ వేసినట్లు సమాచారం.

వడ్డెర కాలనీ సమీపంలో 'ప్లాన్'లో మార్పులు?

మంచిర్యాల నగరంలోని వడ్డెర కాలనీలో పెద్ద మొత్తంలో నిర్మాణాలు కరకట్ట నిర్మాణంతో తొలగించాల్సి వస్తోంది. ముఖ్యంగా కాలనీ నుంచి వాగులో ప్రవేశించే స్థలం వద్ద ఇరువైపులా కట్టడాలకు అధికారులు మార్కింగ్ చేశారు. మార్కింగ్ చేసిన విధంగా పరిశీలిస్తే వాగు నుంచి కనీసం 10 మీటర్ల వరకు కట్టడాలు తొలగించాల్సి ఉంటుంది. ఇందులో వడ్డెర కాలనీ మొదలుకొని పాత మంచిర్యాల వంతెన వరకు పదుల సంఖ్యలో భారీ నిర్మాణాలు ఉన్నాయి. అసలు ఆ నిర్మాణాల వల్లే వాగు కుచించుకుపోయి వరద కాలనీల్లోకి చేరుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. ప్రస్తుతం ఆ నిర్మాణాలను కాపాడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో నిర్మాణానికి ఒక్కో రేటు చొప్పున ముట్టజెప్పడం ద్వారా కరకట్ట నిర్మాణం వాగులోకి జరిపేందుకు అధికారులను మచ్చిక చేసుకొనే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని సమాచారం. ముందుగా తయారు చేసిన 'ప్లాన్'లో మార్పులు చేయడం ద్వారా తమ భూములు, కట్టడాలను రక్షించుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. సర్వే ఆధారంగా మార్కింగ్ చేసిన విధంగా కరకట్ట నిర్మాణం చేపట్టాలని నగర వాసులు కోరుతుండగా, అధికారులు నిబంధనల ప్రకారం ముందుకు సాగుతారా...?లేదా...? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రాళ్లవాగు వెంట కరకట్ట నిర్మాణం చేపట్టడం ద్వారా కాలనీలు ముంపునకు గురికాకుండా కృషిచేస్తున్న స్థానిక ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఈ విషయమై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు: సీపీ

మంచిర్యాల క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వాహనదారుడు సురక్షితంగా ప్రయాణించేలా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాదరహిత ప్రాంతంగా మార్చాలనే ఉద్దేశంతో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. తెల్లవారు జామున ప్రయాణాలతో చోటు చేసుకుంటున్న ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. నిద్ర మత్తు, మద్యం సేవించి డ్రైవింగ్, మితిమీరిన అతి వేగం వంటి కారణాలతో తెల్లవారు సమయంలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాత్రి 11 గంటల తర్వాత అత్యవసరం అయితేనే ప్రయాణాలు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణ, భద్రత మొదటి ప్రాధాన్యం అని, విజబుల్ పోలిసింగ్, పెట్రోలింగ్ విధులు, ట్రాఫిక్ ఎన్ఫోర్స్‌మెంట్ మరింత కఠినంగా అమలు చేస్తామని సీపీ తెలిపారు.

వైభవంగా లలిత పారాయణం

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా మంగళవారం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజ, లలిత పారాయణంను వైభవంగా నిర్వహించారు. దేవాలయ అర్చకులు వామనభట్ల భాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

108 అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ

కోటపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ వాహనాన్ని ఉమ్మడి జిల్లా అంబులెన్స్ వాహనాల ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనం పనితీరును, అందులోని పరికరాలను, రికార్డులను తనిఖీ చేశారు. అత్యవసర సమయంలో ఉపయోగించే మెడికల్ పరికరాలను, వాహనంలో ఉన్న మందుల నిల్వలను పరిశీలించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఇటీవల అంబులెన్స్‌లో గర్భిణీకి సుఖ ప్రసవం చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో అంబులెన్స్ వాహనాల కార్యనిర్వహణ అధికారి సంపత్, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంపై పట్టింపేదీ..?


బెల్లంపల్లిలోని గ్రంథాలయం

- బోరులేక తాగు నీటిసమస్య
- గ్రంథాలయంలో సమయపాలన పాటించని సిబ్బంది
- సమస్యలు పరిష్కరించాలని పోటీ పరీక్షల అభ్యర్థుల ఆవేదన
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోని వైనం

బెల్లంపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయం .కోట్ల రూపాయల నిధులతో ఆధునిక సౌకర్యాలతో నిర్మించారు. గ్రంథాలయంలో విశాలమైన ప్రత్యేక గదులను పాఠకుల కోసం ఏర్పాటు వివిధ మండలాలనుంచి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ప్రతీ రోజు వస్తుంటారు. ఇందుకు అనుగుణంగా గ్రంథాలయాన్ని ఏర్పాటుచేసినప్పటికీ గ్రంథాలయంలో బోరు లేకపోవడంతో తాగునీటి సమస్య ఎదురవుతోంది. అంతేగాకుండా సంబంధిత సిబ్బంది సమయపాలన పాటించడం లేదని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించడంతో పాటు సమయపాలన పాటించననివారిపైశాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కొన్ని నెలలుగా పోటీ పరీక్షల అభ్యర్థులు, పాఠకులు ఉన్నతాధికారుల దృష్టికి, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్న ప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు..

పట్టణంలోని గ్రంథాలయంలో పాఠకులతో పాటు పోటీ పరీక్షల అభ్యర్థులు దాదాపు వంద మందికిపైగా ప్రతిరోజు వస్తుంటారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచిసైతం అభ్యర్థులు వివిధ పరీక్షలకు సన్నద్ధమవుతుంటారు. ఈ గ్రంథాలయం కోట్ల నిధులతో విశాలవంతమైన గదులతో నిర్మించినప్పటికీ బోరు ఏర్పాటు చేయలేదు. తాగునీటి కోసం మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా మంచినీటిని పాఠకులకు అందజేస్తున్నారు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆడా ప్రాజెక్టు నుంచి వచ్చే మిషన్ భగీరథ నీరు ప్రతీ రోజు రాకపోవడం సమస్యగా మారుతోంది. ఒక్కోసారి మంచినీరు కలుషితంగా వస్తున్నాయి. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే పాఠకుల కోసం నిర్మించిన మూత్రశాలలకు మిషన్‌భగీరథ్ నుంచి నీరురాని సమయంలో తాళాలు వేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. కొన్ని నెలలుగా తాగునీటి సమస్య ఎదురవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

ఇన్‌చార్జి లైబ్రేరియనే దిక్కు..

గ్రంథాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ విధులు నిర్వహించే లైబ్రేరియన్ కాసిపేట గ్రంథాలయానికి లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బెల్లంపల్లి గ్రంథాలయానికి కూడా ఇతనే ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నాడు. దీంతోరెండు గ్రంథాలయానికి ఒకే లైబ్రేరియన్ ఉండడంతో సమయపాలన పాటించడం లేదని తరుచూ పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థులు కలెక్టరుకు, సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

అదేవిధంగా గ్రంథాలయంలో విధులు నిర్వహించే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి పాఠకుల పట్ల, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులతో దురుసుగా ప్రవర్తిస్తున్నాడని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రంథాలయానికి సంబంధించిన తాళాలు స్వీపర్ దగ్గర నుంచి మొదలు ఏ సిబ్బంది దగ్గర ఉంటాయో ఎవరు గ్రంథాలయాన్ని తెరుస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. పట్టణంలోని గ్రంథాలయంలో శాశ్వత బోరు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలని, సమయ పాలన పాటించని సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని, పోటీపరీక్షల అభ్యర్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని సమయపాలన పెంచాలని పలువురు కోరుతున్నారు.



అధికారులు పట్టించుకోవడం లేదు...

పి. సాగర్, ఆకెనపల్లి



గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడం లేదు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంలేదు. పలుమార్లు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతిపత్రాలు అందజేశాం. పోటీ పరీక్షల అభ్యర్థులకు అనుకూలంగా గ్రంథాలయంలో సమయ వేళలు పెంచాలి. అభ్యర్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని సమస్యలను పరిష్కరించాలి.

పనివేళలు పాటించడంలేదు...

బి. శేఖర్, మాదారం



గ్రంథాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోడంతో పోటీపరీక్షల అభ్యర్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రంథాలయాల పనివేళలు ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు తెరిచి ఉంచాలి. ఈ సమయంలో గ్రంథాలయంలో సిబ్బంది సైతం అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చొరవ చూపాలి. ఇష్టారీతిన వ్యవహరిస్తున్న సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడవద్దు.

'పర్యావరణ విద్య'ను విజయవంతం చేయాలి

మంచిర్యాల క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ విద్యా ప్రోగ్రాంను విజయవంతం చేయాలని ఎస్ఆర్‌కేఎం కళాశాలలో అధ్యాపకులు మంగళవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్విరాన్మెంట్ ప్రోగ్రాంను రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ, డీఈడీ కాళాశాలలో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రమణ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేంకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కాసిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గత నెల 12న రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన లౌడం సత్యం కుటుంబానికి స్థానిక మహిళ సంఘాలు రూ. 6 వేల ఆర్థిక సహాయం అందించారు. నిరుపేద కుటుంబానికి సత్యం రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై ఆసుపత్రి పాలయ్యాడు. సత్యంకు ఆసుపత్రి బిల్లు చెల్లించే ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నాడు. స్థానిక మహిళలు కొంత డబ్బులు జమ చేయడంతో పాటు పెద్దనపల్లి మాజీ సర్పంచు వేముల కృష్ణ రెండు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. జమ చేసిన మొత్తం డబ్బులను బాధితుని కుటుంబీకులకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయ, లక్ష్మీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

జామెట్రీ బాక్స్‌లు పంపిణీ

లక్సెట్టిపేట, నవంబరు, 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపేట ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం యువ భారత్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జామెట్రీ బాక్సులను సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఇన్‌చార్జి బియ్యాల దినేష్, ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, సభ్యులు గడ్డం మహేష్, రవీందర్, వంశీ, సాయి, వాసుతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

30 గొర్రెలు మృతి

హాజీపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దంపేట గ్రామానికి చెందిన గుర్రాల రాయలింగు, మెరుగు రాజయ్య, పెట్టం సుధాకర్‌కు సంబంధించిన 30 గొర్రెలు యాసిడ్ ఇండిగేషన్‌తో మృతి చెందినట్లు డా. ఎ హారిక తెలిపారు. 50 గొర్రెలు అస్వస్థతకు గురి కాగా వాటికి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

గాంధారివనాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

మంత్రి డాక్టర్ జి వివేక్ వెంకటస్వామి

మందమర్రిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారి బొక్కలగుట్ట వద్ద గల గాంధారివనాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామని, పర్యాటక కేంద్రంగా తీర్చుదిద్దుతామని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులశాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంగళవారం గాంధారీ వనం వద్ద ప్రభుత్వం రూ. 20 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో మెరైగన సౌకర్యాలు కోసం మరిన్ని నిధులు కేటాయిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషన ర్ రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైకుంఠధామం నిర్మాణానికి శంకుస్థాపన...

నియోజకవర్గంలో 600 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. మంగళవారం క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలోని మూసివేసిన సింగరేణి స్టోర్స్ వద్ద రూ. 30 లక్షల నిధులతో వైకుంఠధామం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడం తన లక్ష్యమన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తానని తెలిపారు. మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు మంజూరు చేసిందన్నారు. శ్మశానవాటికకు సింగరేణి యాజమాన్యం ఐదెకరాల స్థలం ఇవ్వడం గొప్పవిషయమని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పలువురికి మంత్రి పరామర్శ

మందమర్రి పట్టణానికి చెందిన మాలమహానాడు ఆల్ ఇండియా


ఓపెన్ జిమ్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకుడు మొయ్య రాంబాబు సతీమణి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. విషయం తెలుసుకున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి మంగళవారం రాత్రి పట్టణంలోని 3వ జోన్‌లోని రాంబాబు ఇంటికి వెళ్లి పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్ సోదరుడు రమేష్‌గౌడ్ అనారోగ్యంతో బాధపడుతుండగా పాత బస్టాండ్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. సమ్మక్క సారక్క జాతర ప్రధాన పూజారి దూలం కనకయ్యగౌడ్ సతీమణి మృతిచెందగా ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. బస్టాండ్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతుండగా మంత్రి పరామర్శించారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు నోముల ఉపేందర్‌గౌడ్, సొత్కు సుదర్శన్, గుడ్ల రమేష్, ఇసాక్, జావేద్‌ఖాన్, సంతోష్, రమేష్ తదితరులు ఉన్నారు.

ఆత్మ రక్షణకు కరాటే దోహదం

దండేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణ కోసం కరాటే దోహదపడుతుందని లింగాపూర్ ప్రభుత్వ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, కరాటే మాస్టర్ బచ్చల అంజన్న అన్నారు. ఇటీవల నస్పూర్ కాలనిలో నిర్వహించిన 5వ రాష్ట్రస్థాయి కరాటే కుంగ్ ఫూ చాంపియన్‌షిప్ పోటీలో గెలుపొందిన లింగాపూర్ మోడల్ స్కూల్ చెందిన ముగ్గురు విద్యార్థులను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మంగళవారం వారు అభినందించారు. అండర్-14 కటాస్ విభాగంలో ఆర్ మానస బంగారు పతకం సాధించగా, జీ అనూష సిల్వర్, శ్రీచందన తృతీయస్థానంలో నిలిచిందన్నారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్, కరాటే మాస్టర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్ రద్దు చేయండి

కాసిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమగూడెం ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ప్రవళిక డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ పేరెంట్స్ కమిటీ సభ్యులు ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మీకి మంగళవారం వినతిపత్రం అందించారు. పేరెంట్స్ కమిటీ సభ్యురాలు సరితచౌహాన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తామని చెప్పడంతో తమ పిల్లలను ప్రైవేటు బడులు మాన్పించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించామన్నారు.

కానీ ఇప్పుడు టీచర్ల కొరత ఉందని ఉపాధ్యా యురాలు ప్రవళికను కాసిపేట ఎంపీపీఎస్ పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపడం సరైంది కాదన్నారు. సోమగూడెం పాఠశాలలో ఐదు తరగతుల్లో 60 మంది విద్యార్థులు ఉన్నారని, ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా వీరిలో ఒకరిని డిప్యూటేషన్‌పై పంపడంతో పిల్లలకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ప్రశ్నించారు. వెంటనే ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు కావ్యసుధ, లక్ష్మి, సరిత, లత తదితరులు పాల్గొన్నారు.

'చలో ఉట్నూర్' విజయవంతం చేయాలి

జన్నారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ధర్మయుద్ధంలో భాగంగా చలో ఉట్నూర్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీల సమన్వయ, జన్నారం మండల రాయిసెంటర్ కార్మెడి బూసం సోనేరావు కోరారు. మండల కేంద్రంలో చలో ఉట్నూర్ ధర్మయుద్ధం పేరిట ఉమ్మడి ఆదివాసీల సంఘం సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ల మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు సిడాం కాళి, జిల్లా కార్యదర్శి నాగేశ్వర్, ఆదివాసీ సేనా మండల అధ్యక్షుడు యశ్వంతరావు, తుడుం దెబ్బ మండల నాయకులు గంగు పటేల్, నాయకులు రాజేశ్, శ్రీనివాస్, ఆనంద్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేసిన ఆటో డ్రైవర్లు

కోటపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్‌పల్లి రహదారి గుంతలమయం కావడంతో ఆటో డ్రైవర్లు స్పందించి మరమ్మతులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ రహదారిలో ఆటోలు నడపడం వల్ల గుంతల్లో టైర్లు పడి ఆటోలు చెడిపోతున్నాయని ఆలోచించిన ఆటో డ్రైవర్లు గుంతల్లో మట్టిని నింపారు. మాజీ ఉపసర్పంచు సలీం తన ట్రాక్టర్ ద్వారా మట్టిని అందించగా ఆటో డ్రైవర్లు గౌస్‌బాబా, సల్మాన్‌ఖాన్, మహేష్, రాజశేఖర్, రాకేష్, మధుకర్, సోహైల్, తిలక్ పారలు, పలుగులు పట్టి గుంతల్లోమట్టి నింపి మరమ్మతులు పూర్తిచేశారు. దీంతో శెట్‌పల్లి, శంకరాపూర్ గ్రామాల ప్రజలు ఆటో డ్రైవర్లను అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

- విభిన్న పంటలకు ప్రోత్సాహకాలు
- ప్రతీ రైతు సేంద్రియ పద్ధతి పాటించేలా...
- జిల్లాలో 15 క్లస్టర్లు, 1875 మంది రైతుల ఎంపిక

నస్పూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం, విచ్చలవిడిగా ఎరువుల వాడకం వలన కలిగే నష్టాల నివారణకు వ్యవసాయం రంగంలో మార్పులు తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన పద్ధతులను అమలు చేస్తున్నాయి. అధిక దిగుబడుల కోసం విచ్చలవిడిగా వినియోగిస్తున్న రసాయనాల కారణంగా పర్యావరణం, భూసారం దెబ్బతింటుండగా ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. సేంద్రియ పద్ధతిలో విభిన్నమైన పంటలు పండించడానికి ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వాలు సమాయత్తమయ్యాయి. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్ అండ్ నేచురల్ ఫార్మింగ్ పథకానికి శ్రీకారం చుట్టింది.

పంటల

ప్రయోజనాలు ఇవే..

జీవ సంబంధ పద్ధతులు, సేంద్రియ ఎరువులు వినియోగం వలన భూమిలోని సూక్ష్మజీవులు మరింత ఉత్పత్తి చెంది భూసారం సారవంతంగా మారుతుంది. సురక్షితమైన పోషకాహారాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో సహజ సాగు పద్ధతులను ప్రోత్సహిస్తుంది. పంటలకు విచ్చలవిడిగా రసాయనాలు వినియోగించడం మూలంగా వాతావరణంలో కర్బన ఉద్గారాలు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలకు మంచి డిమాండ్ ఉండడంతో పండించిన రైతుకు ఆదాయం వస్తుంది. సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన ఉత్పత్తుల వలన మనిషి ఆరోగ్యం సురక్షితంగా ఉండడం, పోషకాలు కూడా అధికంగా లభించే అవకాశం ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ అనుకూలమైన సహజ సిద్ధమైన పంటలను మాత్రమే పండించడం ఎంతో శ్రేయష్కారమని నిపుణులు చెబుతున్నారు. తద్వారా వ్యవసాయ రంగంలో ఉత్పత్తులు పెరిగి రైతులు ఆర్థికంగా ఎదగడం ద్వారా పల్లెల అభివృద్ధి సాధ్యమవుతుందని భావిస్తున్నారు.

సాగు కోసం ఇష్టాను సారంగా వాడుతున్న రసాయనాల పర్యావరణంలో మనుషుల ఆరోగ్యాలకు ముప్పుగా మారడంతో సంప్రదాయ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, కేంద్ర ప్రభుత్వం 60 శాతం చొప్పున ఖర్చు చేయబోతుంది. మంచిర్యాల జిల్లాలో మంచిర్యాల, నస్పూర్, కాసీపేట మినహా మిగిలిన అన్ని మండలాల్లో ప్రకృతి వ్యవసాయం అమలు కానుంది. ఈ పథకం కింద జిల్లాలో 1,875 ఎకరాలను సాగు చేయాలని నిర్ణయించగా, దీని కోసం క్లస్టర్లు, రైతుల ఎంపిక ప్రక్రియ పూర్తయింది.

జిల్లాలో 15 క్లస్టర్ల ఏర్పాటు...

మంచిర్యాల జిల్లాలో ప్రకృతి వ్యవసాయం కోసం మండలానికి ఒక క్లస్టర్ చొప్పున 15 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్‌లో 125 మంది ఔత్సాహిక రైతులను గుర్తించి ఎంపిక చేశారు. ఎంపిక చేసిన రైతులు ఎకరం భూమిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతి ఆచరించే విధంగా అధికారులు ప్రోత్సహిస్తారు. ఎంపిక చేసిన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు ఎంపిక చేసిన రైతుల భూముల్లోని మట్టి శాంపిళ్లను సేకరించి భూసార పరీక్ష కోసం ఆదిలాబాద్‌కు పంపించారు. సేంద్రియ పద్ధతిలో వివిధ రకాల పంటల సాగు.. ఇంటి అవసరాలకు అనుగుణంగా కూరగాయల సాగును ప్రారంభిస్తారు. ప్రకృతి వ్యవసాయంలో ఆవు పేడ, జీవామృతం బయో ఉత్పత్తుల తయారీ,



మల్చింగ్, అంతర పంటల సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించనున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తాం

సురేఖ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, మంచిర్యాల



అందుబాటులో ఉన్న సహజ వనరుల ద్వారా సాగు చేసే పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తాం. ప్రకృతిలో లభించే వనరులను వినియోగించే దిశగా ప్రణాళికను సిద్ధం చేశాం. క్లస్టర్ల ఏర్పాటు రైతుల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. ఎంపిక చేసిన రైతులకు శిక్షణ ఉంటుంది. ప్రకృతి వ్యవసాయం ద్వారా మనిషి ఆరోగ్యంతో పాటు భూసారానికి ఎంతో మేలు కలుగుతుంది. రైతులు అధిక సంఖ్యలో ముందుకు వచ్చి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి. ప్రమాదకర ఎరువులు, పురుగు మందులు సాగు విధానంలో పర్యావరణం, మానవ ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నాయి. ప్రకృతి వ్యవసాయ సేద్యం శ్రేయస్కారం.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రిశ్వితతో హెచ్‌ఎం, పీఈటీ

చెన్నూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆస్నాద గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థిని ఇంగిలి రిశ్విత రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. లక్షెట్టిపేటలో ఇటీవల నిర్వహించిన జోనల్ స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర పోటీలకు ఎంపికైందన్నారు. త్వరలో పెద్దపల్లి జిల్లా ధర్మారంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. మంగళవారం విద్యార్థినిని హెచ్‌ఎం, పీఈటీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచండి

జైపూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీవో శ్రీపతి బాపురావు సూచించారు. మంగళవారం మండలంలోని కాన్కూర్, మిట్టపల్లి గ్రామాలను సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఆయన వెంట హౌజింగ్ ఏఈ కాంక్ష, పంచాయతీ కార్యదర్శులు సాయికిరణ్, సురేందర్ ఉన్నారు.



పంచాయతీ ఎన్నికలపై స్పష్టత



- స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు క్యాబినెట్ ఆమోదం
- 15వ ఆర్థిక సంఘం నిధులు రాబట్టుకునేలా చర్యలు
- పాత రిజర్వేషన్ల ఆధారంగానే వెళ్లాలని నిర్ణయం
- జిల్లాలో 3,53,895 మంది ఓటర్లు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపు జోష్‌తో స్థానిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని భావిస్తోంది. డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వ హించాలని నిర్ణయించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడప గడపకు తీసుకెళ్లి తర్వాత లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. సోమవారం నిర్వహించిన క్యాబినెట్‌లో స్థానిక ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు రూ.3 వేల కోట్ల వరకు 15వ ఆర్థిక సంఘం నిధులు రావాల్సి ఉంది. వచ్చే ఏడాది మార్చిలోపు ఈ నిధులు మురిగిపోయే పరిస్థితి నెలకొంది. అప్పటిలోగానే పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి, పాలక వర్గాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆ నిధులను రాబట్టాలని నిర్ణయించింది.

● జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు..

కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో 3,53,895 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,76,606 మంది పురుషులు,1,77,269 మంది మహిళలు ఉన్నారు, వీరి కోసం 2,874 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చే యను న్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణకు యం త్రాంగం సిద్ధంగా ఉండడంతో ఇటీవల రాష్ట్ర ఎన్ని కల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇప్పటికే వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితా, ఓటరు జాబి తాపై అభ్యంతరాలు స్వీకరణ పూర్తయ్యాయి. బ్యాలెట్ పేపర్లు, సిబ్బంది, నోడల్ అధికారుల కేటా యింపు, రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. రెండు విడతలుగా ఆర్వోలు, పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. సర్పం చులకు గులాబీరంగు, వార్డు సభ్యు లకు తెలుపురంగు బ్యాలెట్ పేపర్లను ముద్రించేం దుకు సిద్ధంగా ఉంచారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కేటాయింపుపై పలువురు హైకోర్టుకు వెళ్లడంతో స్టే ఇచ్చారు. దీంతో ఎన్నికల ప్రక్రియ నిలిచి పోయింది.

● మారిన పరిస్థితుల్లో..

మారిన పరిస్థితుల్లో పంచాయతీ తదుపరి పరిషత్ ఎన్నికలను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల విడుదలైన ఎన్నికల నోటిఫికేషన్‌లో మొదట పరిషత్, తర్వాతే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా నిర్ణ యించారు. మారిన పరిస్థితుల్లో తొలుత పంచా యతీ తదుపరి పరిషత్ ఎన్నికలను పూర్తి చేయా లని ప్రభుత్వం భావిస్తోంది. హైకోర్టులో సైతం పంచాయతీ ఎన్నికల పై కేసులు ఉన్నాయి. దీంతో రిజర్వేషన్లు ప్రభుత్వం గతంలో అనుకున్న ప్రకారం వెళ్లే అవకాశం లేదు.. కోర్టు రిజర్వేషన్లపై స్టే విధించడం, 24లోపు ఎన్నికల నిర్వహణ ఎప్పుడు చేపడుతారో హైకోర్టుకు తెలపాల్సి ఉండడంతో ప్రభుత్వం పార్టీ పరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలకు సిద్ధమవుతోంది. 2019లో స్థానిక సంస్థల్లో సామాజిక వర్గాలకు కేటాయించిన రిజర్వేషన్ల ఆధారంగానే ఎన్నికలకు వెళ్లే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

మండలాల వారీగా ఓటర్లు..

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఆసిఫాబాద్	15,039	15,276	0	30,315
బెజ్జూరు	11,685	12,047	2	23,734
చింతలమానేపల్లి	12,118	11,837	0	23,955
దహెగాం	11,014	11,077	1	22,092
జైనూరు	11,936	12,427	0	24,363
కాగజ్‌నగర్	22,857	22,383	2	45,242
కెరమెరి	12,145	11,880	1	24,026
కౌటాల	13,796	13,560	1	27,357
లింగాపూర్	5,103	5,479	1	10,583
పెంచికలపేట	6,218	6,084	0	12,302
రెబ్బెన	14,523	14,201	0	28,724
సిర్పూర్(టి)	11,016	11,163	3	22,182
సిర్పూర్(యూ)	5,835	6,440	2	12,277
తిర్యాణి	8,863	9,281	4	18,148
వాంకిడి	14,458	14,134	3	28,595

కాంగ్రెస్ పార్టీలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

కౌటాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సురేష్, మాజీ వార్డు సభ్యులు శుక్రుజీ, ఫకిరా, వత్తుజీ, ఆరె సంఘం నాయకులు ఉద్ధవ్, ఎడ్డిపటేల్, బండు, రఘునాథ్‌తో పాటు 40 మంది మాతాజీ ట్రస్ట్ సభ్యులు మంగళవారం ఎమ్మెల్సీ దండె విఠల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి

జైనూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పక పాటించాలని జైనూర్ ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాంనాయక్ తండా ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి రోజు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాలని సూచించారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను శ్రద్ధగా వినాలని సూచించారు. అనంతరం గూడమామడా, హనుమాన్ గూడ, మాన్కుగూడ తదితర గ్రామాల్లో ఇందిరమ్మ గృహాలను పరిశీలించారు. పనులు సకాలంలో నాణ్యతగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో వెంట ఎంపీవో శశికుమార్, సీనియర్ అసిస్టెంట్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వైద్యుల పోస్టులకు ఇంటర్వ్యూలు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కాగజ్‌నగర్‌లో గైనకాలజిస్టు-2, బెజ్జూరుల జనరల్ డ్యూటీ డాక్టర్, జైనూరులో -2 పోస్టులు కాంట్రాక్టు పద్ధతిపై భర్తీ చేయడానికి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ అవినాష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఇంటర్వ్యూలకు ధ్రువపత్రాలతో నేరుగా హాజరు కావాలని సూచించారు.

సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైన బాధితులు తక్షణమే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో 41 మంది సెల్‌ఫోన పోగొట్టుకున్న బాధితులకు ఫోన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మొత్తం 373 మొబైల్ ఫోన్లు రికవరీ చేయగా, వాటి విలువ రూ.44.76 లక్షలు ఉంటుందన్నారు. మొబైల్ ఫోన్‌లు అందుకున్న బాధితులు ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి సీఐ రాణా ప్రతాప్, ఐటీకోర సీఐ రవీందర్, శ్రీధర్, కో ఆర్డినేటర్ శ్రీనివాస్, సీసీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులు, తీవ్రమైన పొగమంచు నేపథ్యంలో వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వీలైనంత వరకు వాహనదారులు రాత్రి, తెల్లవారు జామున ప్రయాణాలు చేయకుండా ఉండాలన్నారు. పొగమంచు కారణంగా వాహనాలు, పాదాచారులు స్పష్టంగా కనిపించకుండా పోవడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకావాలు ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100 ద్వారా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

పనులను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతుల పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ, విద్య, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు, ఇంజినీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు పని కల్పించేందుకు అవసరమైన పనులు గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహించి పనులను ఎంపిక చేయాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టాలని పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, తాగునీరు, బాల బాలికలకు ప్రత్యేక మూత్రశాలల నిర్మాణాలు, భవన మరమ్మతులు, బ్లాక్ బోర్డులు, ఫ్యాన్ల ఏర్పాటు వంటి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, భవనాల నిర్మాణాలు, వసతుల కల్పా పనులు త్వరగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సంక్షేమాధికారి అధికారి భాస్కర్, విద్యాశా ఖాధికారులు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్, గృహ నిర్మాణ శాఖ పీడీ, తహసీల్దార్, కాగజ్‌నగర్ డివిజనల్ ఇంజనీర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతి పరిశీలించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

జిల్లాను మొదటి స్థానంలో నిలుపుదాం



జ్ఞాపికను అందజేస్తున్న యువజన క్రీడశాఖ అధికారి అశ్వక్ అహ్మద్

ఆసిఫాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువజన ఉత్సవాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలుపుదామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన జాతీయ యువజన ఉత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమలోని కళా నైపుణ్యాన్ని, ప్రతిభను బాహ్య ప్రపంచానికి తెలియపర్చడం కోసం ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. జిల్లా స్థాయిలో ఎంపికైన కళాకారులు రాష్ట్ర స్థాయిలో ఆ తరువాత జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని తెలిపారు. జిల్లా యంత్రాంగం కళాకారులను ఎల్లప్పుడు ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి అశ్వక్ అహ్మద్ కలెక్టర్‌కు జ్ఞాపికను అందశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి అశ్వక్ అహ్మద్, యువజన సంఘాల ప్రతినిధులు, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కాగజ్‌నగర్‌లో గల ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో విద్యాశాఖ, ఇంజనీరింగ్, వైద్య, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు, గురుకుల ప్రిన్సిపాళ్లు, పేరెంట్స్ కమిటీ సభ్యులతో కాగజ్‌నగర్ పట్టణంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల పాఠశాలలో 455 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా సంక్షే మాధికారి భాస్కర్, ప్రిన్సిపాల్ కనకవర్మ, స్టూడెంట్ కౌన్సిలర్ ఇంద్రకుమార్, పేరెంట్స్ కమిటీ సభ్యులు సత్యనారాయణ, సునిత పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మండల కార్యవర్గం

రెబ్బెన, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండల ఎస్ఎఫ్ఐ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజన్న, ఉపాధ్యక్షులుగా ఆశిష్, తిరుపతి, కార్యదర్శిగా దివ్య, సహాయ కార్యదర్శులుగా వైష్ణవి, రమ్య, కమిటీ సభ్యులుగా హర్షవర్ధన్, శ్రీరామ్, రక్షిత, అజిత్, విజయ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కార్తీక్ పాల్గొన్నారు.

డిజిటల్ లర్నింగ్‌పై శిక్షణ

కాగజ్‌నగర్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ డివిజన్‌లోని ఇంగ్లీష్, సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్స్‌కు మంగళవారం డిజిటల్ లర్నింగ్ శిక్షణ కార్యక్రమం స్థానిక ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా డీసీఈబీ సెక్రటరీ, పీజీహెచ్‌ఎం హన్మంత్‌రావు మాట్లాడారు. రిసోర్స్ పర్సన్స్‌కు వివరిస్తున్న అంశాలను అర్థం చేసుకొని పాఠశాల స్థాయిలో అమ లు చేస్తే విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్, ఎంఈవో, కోర్సు డెరెక్టర్ వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ శిక్షణ ద్వారా విద్యార్థులకు నూతన విషయాలు తక్కువ సమయంలో సులభంగా అవగాహన కల్పించగలుగుతామన్నారు.

మొక్కలను సంరక్షించాలి

రెబ్బెన, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. గోలేటి సీహెచ్‌పీ పరిసరాల్లో మంగళవారం మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో అధికారులు రాజమల్లు, కోటయ్య, అటవీ అధికారి సుష్మ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలి



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

సిర్పూర్(టి), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్ (టి) రైల్వే స్టేషన్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని మంగళవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆధ్వర్యంలో దక్షణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కు మార్ శ్రీవాస్తవకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు సిర్పూర్(టి) వరకు పొడగించాలని, కాజీపేట-బల్లార్షా మధ్య నడిచే బల్లార్షా ఎక్స్‌ప్రెస్ సిర్పూర్(టి)లో హాల్టింగ్ ఇవ్వాలని కో రారు. దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ ఇవ్వాలని కోరారు. ఆయన వెంట ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

సిర్పూర్(టి), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలంలోని మేడిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి. గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక కాగా గ్రామంలో 77 గ్రామాలను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో గ్రామం రిజర్వు ఫారెస్టులో ఉందని అటవీ అధికారులు అడ్డుకుం టున్నారు. ఈ మేరకు మంగళవారం రెవెన్యూ, అటవీ, పంచాయతీ అధికారులు గ్రామస్థులతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్చించారు. గతంలో గ్రామంలో ఆర్‌ఓఎఫ్ కింద 17 మందికి పట్టాలు ఇవ్వడంతో మొదటగా 17 మంది ఇళ్ల నిర్మించునేందుకు అధికారులు అనుమతులు ఇచ్చి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ త్వరలో మిగితా ఇళ్ల నిర్మించుకోవడానికి కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో ఎఫ్ఆర్వో ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సత్యనారాయణ, ఏఈ నజీయోద్దీన్, కార్యదర్శి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, నిరుద్యోగులు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయి లక్ష్యాలను చేరుకోవాలని మున్సిపల్ కమిషనర్ గజానంద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వాణిశ్రీలు, సిబ్బంది ప్రవీణ, స్వర్ణలత, సదానందం, సతీదేవి, రామయ్య, సలీం, గోపి పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం గెర్రె గ్రామంలో హత్యకు గురైన శ్రావణి కుటుంబానికి న్యాయం చేయాలని మంగ ళవారం తహసీల్దార్ కవితకు డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ నాయులు వినతిపత్రం అందజేశారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని సందీప్‌నగర్ సీఎస్ఐ సెయింట్ జాన్ చార్జి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన యు ఫీడ్ థెం ఆర్గనైజేషన్ వారి సహకారంతో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోయగాం, ధనోర, సావర్‌ఖేడ, పార్ధ గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎంపీవో సాయిరాంగౌడ్ పరిశీలించారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఈసుగాం శివమల్లన్న ఆలయంలో మంగళవారం మాసశివరాత్రిని పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

కాగజ్‌నగర్ టౌన్, (ఆంధ్రజ్యోతి): శ్రీ శక్తి మహిళా సంఘం ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

చింత లమానే పల్లి,(ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో నైట్ వాచ్‌మెన్ -1(మహిళ) కాంట్రాక్టు పద్ధతిన నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో జయరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): టీజీటీ ఎస్‌ఆర్‌డబ్ల్యూ ఆర్‌జేసీ బాలికల కళాశాలలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ పోటీలు నిర్వహిస్తున్న అసోసియషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అశోక్, ఐలయ్య తెలిపారు.

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి



బెజ్జూరులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ నాయకులు

జైనూర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని తుడుం దెబ్బ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్‌రావ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివాసీ ధర్మ యుద్ధ సభ నిర్వాహణ కోసం ఆదివాసీ సంఘాల నాయ కులు మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా పలు తీర్మానాలు చేశారు. లంబా డాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల చట్టాలు, హక్కులను కాల రాస్తూ ధనికులకే వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. ఆదివాసీ డిమాండ్లపై ఈ నెల 23న ఉట్నూరులో నిర్వహించ తలపెట్టిన ఆది వాసీ ధర్మ యుద్ధ సభను విజయవంతం చేయాలని కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి అన్ని ఆదివాసీ సంఘాల నాయకులు, పటేళ్ళు, దేవారిలు, మహాజన్‌లు, సార్మేడిలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కనక యాదవ్‌రావ్ కోరారు. సమావేశంలో సార్మేడిలు ఆత్రం ఆనంద్‌రావ్, జుగునాక దేవరావ్, అనక దేవేందర్, ఆత్రం ఆనంద్‌రావ్, మేస్రాం నాగోరావ్, పవేందుర్ ప్రకాష్, సెడ్మకీ భగ్వం త్‌రావ్, గాడాం మోహన్, మడావి క్రిష్ణ, పుండలిక్ పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్‌లో ఈ నెల 23న తలపెట్టిన ఆదివాసీ ధర్మ యుద్ధం కార్యక్రమ పోస్టర్లను మండల కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సకారాం, ఓంప్రకాష్, శంకర్, బక్కయ్య, రాజారాం, అమృత, సతీష్, రమేష్, హన్మంతు, రమేష్, శ్యాంరావు, మల్లేష్, లలయ్య, గంగారాం, రాజారాం, పురుషత్తం, సత్తయ్య, శ్రీహరి, ఏనుక శ్రీహరి, నందారాం, వెంకటేష్, వినోద్, షణ్ముఖ, వెంకటేష్, గణేష్, సుదర్శణ్ పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివాసీ ధర్మ యుద్ధం పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిన్నన్న, అశోక్, సకారాం, భుజంగరావు, మల్లేష్, సర్దాజాతి, మధునయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.